## వాసవి శ్రీనిలయంలో ఘనంగా బాలల దినోత్సవం



వేడుకలో పాల్గొన్న సినీనటుడు నాగినీడు తదితరులు


వనస్థలిపురం: చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయం గేటెడ్ కమ్యూనిటీలో మంగళ వారం రాత్రి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు వి.నాగినీడు చదువు, నడవడిక, భవిష్యత్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. గొర్రెపాటి నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా భువనగిరి జిల్లా సీనియర్ సెషన్స్ జడ్జి మురళీమోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో చిన్నారులు వైష్ణవి, మేడిని, ధృవ, అపూర్వ, హాస్య, సంప్రీతి, తీర్థ, ఆఫ్సిన్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

- బ్యాంక్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా
- అనుమానం వస్తే ఖాతాల సీజ్?

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి ఓట్లు దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం, వివిధ రకాల బహుమతులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో ఎన్నికల సంఘం అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా నగదు తరలించే వారిని పట్టుకుంటున్నారు. అయినా డబ్బులు పంపిణీకి నూతన మార్గాలను ఎంచుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలకు నగదును బదిలీ చేస్తే ఎలాంటి ఇబ్బందులు రాకుండా నగదును అందించవచ్చని భావిస్తున్నారు. దీంతో బ్యాంకుల ద్వారా అధిక మొత్తంలో జరిగే లావాదేవీలపై దృష్టి సారిస్తే అక్రమ నగదు పంపిణీపై మరింత దృష్టి సారించవచ్చనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం అధిక మొత్తంలో జరిగే నగదు లావాదేవీపై నిఘా ఏర్పాటు చేసింది. లక్షల నుంచి అధిక మొత్తంలో జరిగే లావాదేవీలను అధికాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపే వారి వివరాలను తమకు అందించాలని ఎన్నికల సంఘం అధికారులు బ్యాంకు అధికారులను కోరినట్టు తెలుస్తోంది.





**మహిళా సంఘాల ఖాతాలపై నజర్...**

ఎన్నికల సంబంధించిన అంశంలో మహిళా ఓటర్లకు ఉన్నంత ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. మహిళా ఓటర్లను మచ్చిక చేసుకుని వారి కుటుంబీకుల ఓట్లను కూడా తమకు వేయించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సంఘాలతో అభ్యర్థులు తరఫున నియమించిన ప్రత్యేక దూతలు సమావేశాలు నిర్వహించి తమ పార్టీలకే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా వీరికి నగదు బదిలీ చేస్తే మిగతా సభ్యులకు కూడా పంపిణీ చేస్తారు. ఇలాంటి వాటిపై ఎన్నికల కమిషన్ నిఘా పెంచింది. బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు కాకుండా ఇతర వ్యక్తులు సంస్థలు నుంచి స్వయం సహాయక సంఘాలకు డబ్బు జమ అవుతున్నదా?అనే వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అక్రమంగా జరిగే లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఆ బ్యాంకు ఖాతా సీజ్ చేసేలా ఎన్నికల అధికారులు తీసుకున్నట్లు సమాచారం.

**డిజిటల్ చెల్లింపులపై...**

ఆన్డ్రాయిడ్ ఫోన్ అందుబాటులో ఉంటే గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా పెద్ద మొత్తంలో నగదు బదిలీ జరుగుతోంది. డిజిటల్ ఖాతాల ద్వారా లక్ష్యలో లావాదేవీలు జరిగితే సంబంధిత ఖాతాదారుల నుంచి వివరణ తీసుకునే అవకాశం ఉంది. పోటీ చేసే అభ్యర్థుల బంధువుల ఖాతా వివరాలను కూడా తీసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు నగదు బదిలీలపై మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది.

## మజ్లిస్‌కు విశేష ఆదరణ

**మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బలాల**



ఎన్నికల ప్రచారంలో బలాలను ఆశీర్వదిస్తున్న ఓ వృద్ధురాలు

మలక్‌పేట: ప్రజల నుంచి మజ్లిస్ పార్టీకి విశేష ఆదరాభిమానాలు లభిస్తున్నాయని మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రూప్ మీటింగ్‌లలో మాట్లాడుతూ.. అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చానని, ఎన్నికల్లో పతంగి గుర్తుకు ఓటేసి మరోసారి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్ పాల్గొన్నారు.

## బహుజనుల సంక్షేమానికి కృషి చేస్తా

**మలక్‌పేట అభ్యర్థి అలగోల రమేష్**



ప్రచారం చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి రమేష్

మలక్‌పేట: బహుజనుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తానని మలక్‌పేట బీఎస్పీ అభ్యర్థి అలగోల రమేష్ అన్నారు. బుధవారం మూసారంబాగ్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. డోర్ టూ డోర్ తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. బహుజన రాజ్యాధికారం కోసం ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. నాయకులు నరేందర్ నాయక్, సురేందర్, శ్రీను, మురళీకృష్ణ పాల్గొన్నారు.

# బీజేపీతోనే మహిళా సాధికారత



నాగోలులోని ఓ టిఫిన్ సెంటర్‌లో దోశ వేసి ఓట్లు అభ్యర్థిస్తున్న సామ రంగారెడ్డి

- బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్/లింగోజిగూడ: మహిళా సాధికారత, మహిళలకు రాజ్యాధికార విషయంలో బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి మరే రాజకీయ పార్టీకి లేదని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రచారం చేసి ఓటను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు బీజేపీ కట్టుబడి ఉందనటానికి నిదర్శనమన్నారు, ఎస్సీ వర్గీకరణకు కమిటీని, తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడంపై బీజేపీ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. సీఎం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం, ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిర్మింపజేసిన ఫ్లైఓవర్ కూలిపోవడం కేసీఆర్ ప్రభుత్వం కూలిపోవటానికి సంకేతాలన్నారు. కార్యక్రమంలో శ్యామల, బద్దం బాలకృష్ణగౌడ్, పాల్వాయి సంజీవరెడ్డి, గణేష్, రామకృష్ణ, నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్‌లో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి బుధవారం సామ రంగారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

**బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి: బీజేపీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ**

నాగోలు: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డికి మద్దతుగా మంగళవారం రాత్రి కొత్తపేట డివిజన్ శివమ్మనగర్‌లో కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సిద్దాల ఐలయ్య ఆధ్వర్యంలో నాగోలు సాయినగర్ కాలనీలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో డీకే అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

**పలువురి చేరిక..**

హస్తినాపురం: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సామ రంగారెడ్డికి మద్దతుగా హస్తినాపురం డివిజన్ జిల్లాపరిషత్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ డివిజన్ అధ్యక్షుడు బూరం ప్రకాశ్ ఆధ్వర్యంలో 600 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు.

## ఎల్బీనగర్ బరిలో మిగిలింది 48 మంది

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎన్నికల బరిలో 48 మంది తమ అదృష్టాన్ని పరీక్షించు కోబోతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారంతో ముగియగా, 9 మంది స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ల ఉపసంహరించుకున్నారు. దాఖలైన మొత్తం నామినేషన్ పత్రాల్లో 57ను అధికారులు ఆమోదించగా, వాటిలో 9 నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎల్‌బీనగర్‌లో గతంలో ఎప్పుడూ లేని విధంగా అత్యధికంగా 48 మంది అభ్యర్థులు పోటీలో ఉండటం గమనార్హం. ప్రధాన పార్టీలలో బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్, బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలతో పాటు పోటీలో మిగిలిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు.

**మలక్‌పేటలో ఉపసంహరణ నిల్**

**... పోటీలో 27 మంది అభ్యర్థులు**

చాదర్‌ఘాట్: మలక్‌పేటలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులెవ్వరూ ఉపసంహరించుకోలేదు. దాంతో నామినేషన్లు సమర్పించిన 27 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఆర్‌ఓ కె.వెంకట ఉపేందర్ రెడ్డి తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు బుధవారం కాగా, ఎవ్వరూ పోటీ నుంచి తప్పుకోవటానికి రాలేదు. మలక్‌పేటలో మొత్తం 32 మంది నామినేషన్లు వేయగా, అందులో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే.

## ఎల్‌బీనగర్ అభివృద్ధే నా లక్ష్యం



మధుయాష్కీగౌడ్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

- కాంగ్రెస్ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం/ చంపాపేట/హయత్‌నగర్: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఎల్‌బీనగర్ అభివృద్ధే నా ప్రథమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. బుధవారం చంపాపేట డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, జాతీయ స్థాయి నాయకుడిగా ప్రభుత్వ నిధులే కాకుండా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నుంచి కూడా నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని అన్నారు. ఎల్‌బీనగర్ అభివృద్ధి చెందిందని సోషల్ మీడియాలో ఎంతగా ప్రచారం చేసినా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాటలు ఎవ్వరూ నమ్మరన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని, గెలిచిన నెల రోజుల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. అనంతరం దివ్యాంగుల సమావేశంలో పాల్గొన్న యాష్కీ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

**ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు..**

ఆర్టీసీ కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ సంఘం ఉమ్మడి అభ్యర్థి రాజిరెడ్డి తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకుని మధుయాష్కీ గౌడ్‌కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**హయత్‌నగర్ డివిజన్‌లో..**

నా పాదయాత్రను ఎవరు అడ్డుకోలేరని, రానున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే నని మధుయాష్కీగౌడ్ అన్నారు, బుధవారం హయత్‌నగర్ డివిజన్‌లో మదర్ డెయిరీ నుంచి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా తమ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారన్నారు. నాయకులు గజ్జి శ్రీనివాస్, సుజాతారెడ్డి, గజ్జి భాస్కర్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, నర్సింహ పవన్, టీజేఎస్ నాయకులు వినయ్, రంగారెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**బీజేపీ మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి**



ఓల్డ్‌మలక్‌పేటలో ప్రచారం చేస్తున్న సురేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: ప్రజా సమస్యలు పరిష్కరించమే ధ్యేయంగా పని చేస్తానని మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్ అన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో డివిజన్ అధ్యక్షుడు రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత స్వచ్ఛందంగా బీజేపీకి అండగా నిలబడుతున్నారన్నారు, మలక్‌పేటలో బీజేపీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సాయిబాబానగర్, మూన్‌లైట్ స్కూల్, అయోధ్యనగర్, సరోజిని నగర్‌లో ఇంటింటికీ తిరిగి ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకోటేశ్వర్‌రావు, నాయకులు రేణుక, చౌకి రాజు, ప్రసాద్, ప్రవీణ్‌గుప్తా, సతీష్‌సింగ్, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మలక్‌పేటలో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

**అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి**



సైదాబాద్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న తీగల అజిత్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేటలో బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సైదాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని ఎల్‌ఐసీ కాలనీ, జయానగర్, ఇంద్రప్రస్థ కాలనీ, లోకాయుక్త కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ గెలిచి కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. ప్రచారంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కొరుడు భూమేష్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, తీగల సునరితా రెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్ పాల్గొన్నారు.

## మరోసారి కేసీఆర్ పాలన వచ్చేలా దీవించండి

- బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి



చిప్పలపల్లిలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: కులం, మతం పేరుతో ఓట్ల కోసం వచ్చే పార్టీల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, కారు గుర్తుకే ఓటు వేసి మరోసారి కేసీఆర్ పాలన వచ్చేలా దీవించాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని 11 గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సబితారెడ్డి మాట్లాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తున్నదన్నారు. తొమ్మిదన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతు బంధు, మిషన్‌భగీరథ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలైయ్యాయన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే ఆ పథకాలకు ఇచ్చే నగదు పెంచనున్నామన్నారు. ఆడబిడ్డలా తనను ఆదరించి మరోసారి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర దేవేందర్, జయమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'డయల్ యువర్ డీఎం'

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ డిపో నడిపే బస్సు సర్వీసులపై ప్రయాణికుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలుసుకొనేందుకు గురువారం(నేడు) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎన్. రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు 9959224058 నంబర్‌కు కాల్ చేసి తమ సూచనలు, సలహాలు తెలియజేస్తే .. ఆర్టీసీ సేవలను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరు





ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి**

హస్తినాపురం: యాభై సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి సాధించలేని అభివృద్ధిని బీఆర్‌ఎస్ పార్టీ తొమ్మిదిన్నరేళ్ల సాధించిందని, కాంగ్రెస్ హయాంలో అన్ని రంగాలలో కుంభకోణాలేనని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సొంత పార్టీ నాయకుల టికెట్లు అమ్ముకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. కర్ణాటకలో అమలు చేయలేని పథకాలు ఇక్కడ ఎలా అమలు చేస్తారని, కాంగ్రెస్ పార్టీని గుడ్డిగా నమ్మడానికి తాము కర్ణాటక ప్రజలం కాదని, తెలంగాణ బిడ్డలం అని సుధీర్‌రెడ్డి అన్నారు. దేశ ప్రజల విశ్వాసం పోగొట్టుకున్న కాంగ్రెస్ పార్టీ ఏముఖంతో ఓట్లు అడుగుతుందని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. వరదలు వచ్చినప్పుడు, కరోనా సమయంలో రాని నాయకులు కొత్తకొత్త వరసలతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారని, వారిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి కారు గుర్తుకే ఓటు వేసి గెలించాలని సుధీర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ టీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, వేంరెడ్డి నర్సింహ్మరెడ్డి, మాజీ కార్పొరేటర్లు లక్ష్మీప్రసన్న, ముద్రబోయిన శ్రీనివాసరావు, ఈశ్వరమ్మయాదవ్, ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

**శ్రీమల్లికార్జున భక్త సమాజం మద్దతు**

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డికి శ్రీమల్లికార్జున భక్త సమాజం స్వాములు సంపూర్ణ మద్దతు పలికారు. మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన సమావేశానికి సమాజం రాష్ట్ర అధ్యక్షుడు హాజరై సుధీర్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు.

## అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

చైతన్యపురి: నామినేషన్ ఉపసంహరణ తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బుధవారం గుర్తులు కేటాయించినట్టు ఎల్‌బీనగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ తెలిపారు. ఎన్నికల పరిశీలకులు రాంకుమార్ సధురప్పన్ పర్యవేక్షణలో అభ్యర్థుల సమక్షంలోనే వారికి గుర్తులు కేటాయించామన్నారు. కాగా, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన ఓటరు సమాచారం స్లిప్పులను ఈనెల 22 లోగా బూత్ లెవెల్‌లో పంపిణీ చేస్తారని పంకజ తెలిపారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా సెక్టోరల్ అధికారులు, పర్యవేక్షక అధికారుల పర్యవేక్షణలో ఓటరు స్లిప్పులు అందజేస్తారన్నారు. స్లిప్పులు అందని ఓటర్లు కొత్తపేట ఈస్ట్ జోనల్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోని కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 040-24140937 కు లేదా డిప్యూటీ ఎస్టేట్ అధికారి విజయలక్ష్మిని 7702104249లో సంప్రదించాలన్నారు.

## మధుయాష్కీ ఇంట్లో పోలీసుల సోదాలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి సోదాల పేరిట పోలీసులు హై డ్రామాకు తెర తీశారు. డబ్బులు పంచుతున్నారనే సమాచారంతో అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, ఏసీపీ భీంరెడ్డిల ఆధ్వర్యంలో ఎస్‌ఓటీ పోలీసులు, ఈసీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వినాయకనగర్‌లో మధుయాష్కీ గౌడ్ నివాసం ఉంటున్న ఇంట్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎవరు ఫిర్యాదు చేశారు, వారెంట్ ఉందా అంటూ ప్రశ్నించారు. అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారంటూ వారిపై మండిపడ్డారు. ఇంతలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వావాదం జరిగింది. మధుయాష్కీ ఇంటి యజమాని బీరువాను పోలీసులు తెరిచారు. అందులో రూ.5.5 లక్షలను గుర్తించారు. ఈ డబ్బులకు తగిన ఆధారాలు చూపించడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇలా ఉండగా, తమకు డయల్ 100 నుంచి డబ్బులు పంచుతున్నట్టు సమాచారం రావడంతో ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇచ్చి, వారి అనుమతితోనే సోదాలకు వెళ్లామని హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు. తాము ఎవరికి అనుకూలంగా పని చేయమని ఎలక్షన్ కమిషన్ ఆదీనంలోనే పని చేస్తామన్నారు.

**ఓటమి భయంతోనే : మధుయాష్కీ**

హయత్‌నగర్: ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నాయకులపై దాడులకు తెగబడుతున్నారని మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. తన ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడంపై ఆయన స్పందిస్తూ .. స్థానిక ఎమ్మెల్యేకు ఓటమి భయం పట్టుకోవడంతో మమ్మల్ని, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారన్నారు. పోలీసుల వెంట మఫ్టీ పోలీసుల్లాగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు వచ్చారని, తన ప్రచారాన్ని అడ్డుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే ఇలాంటి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర అడ్వొకేట్ అసోసియేషన్ సభ్యులు వెంకటేష్‌యాదవ్, పీసీసీ కార్యదర్శి జయప్రకాష్, గజ్జి భాస్కర్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో బూత్‌ల పంచాయితీ

దిల్‌సుఖ్‌నగర్: బూత్‌ల కోసం బీఆర్‌ఎస్ నాయకులు గొడవకు దిగారు. ఒకరినొకరు బూతులు తిట్టుకుంటూ పరస్పరం దాడి చేసుకున్నారు. వివరాలు... ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్‌లో ముందు నుంచి ఉన్న నాయకులు, కొత్త నాయకుల మధ్య వివాదం నడుస్తోంది. ఎన్నికల బూత్‌ల బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న చర్చ జరగడంతో పాత, కొత్త నాయకుల మధ్య వివాదం మొదలైంది. బూత్‌ల బాధ్యత మాకు కావాలంటే...కాదు మాకే కావాలని వాగ్వాదానికి దిగారు. మొదట చిన్నగా ప్రారంభమైన గొడవ చినికి చినికి గాలివానగా మారి నాయకులు కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో రంగంలోకి దిగిన నియోజకవర్గ స్థాయి నాయకులు కొందరు వారిని మందలించి గొడవ సద్దుమణిగేలా చేశారు. రానున్న రోజుల్లో ఈగొడవ ఎక్కడి వరకు వెళ్తుందోనని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

## కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 15, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 23, బీర 23, క్యాబేజ్ 15, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 45, దొండ 18, చిక్కుడు 35-55, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలు 21, దోస 13, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

## కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

**మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్**



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రశాంత్‌రెడ్డి తదితరులు

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీ.నియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్శితులై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. మహేశ్వరం కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందింది, అధికార దాహంతో బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన సబితా రెడ్డిని చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు.

**కేఎల్‌ఆర్‌ను గెలిపించండి...**

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లలోని లక్ష్మీనగర్, విజయపురి, ఎస్‌బీఐ కాలనీల్లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఎల్‌ఆర్ సతీమణి విజయలక్ష్మి గడప గడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కేఎల్‌ఆర్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు గట్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్సీ మద్దతు కోరిన కేఎల్‌ఆర్**

ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్‌ను బుధవారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కలిశాడు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో తనకు మద్దతిచ్చి మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు.